పేజీకథ

# రాయల్ థీఫ్

-ఎన్.హరిప్రియ,

"గోకుల ఎంత అదృష్టవంతురాలు!" ఊరు ఊరంతా అబ్బురంగా చెప్పుకున్నారు.

నిజమే! గోకుల చాలా అదృష్టవంతురాలు. లేకపోతే సామన్య కుటుంబంలో పుట్టిన గోకులకు కలలోనైనా ఊహించని వరుడు దొరకటమా?! విష్ణు అనూహ్యమైన సిరిసంపదలకు ఏకైక వారసుడే కాదు. జగదేక సుందరుడు కూడా. గోకుల అందానికి ముగ్ధుడై ఆస్తి, అంతస్థుల తేడా చూడకుండా తన అందానికి దీటైనదని ఓ.కె. అన్నాడు.




తమ తాహతుకు, స్తోమతకు మించినదే అయినా ఒక్కతే బిడ్డ కావటాన పరంధామయ్య దంపతులు ఈ సంబంధానికి తలవంచారు. పైగా కోరి కావాలని వచ్చిన సంబంధం!

కన్నవాళ్ళ గొప్పదనం అదే! తమ బిడ్డల సౌఖ్యం కోసం తమ సుఖాల్ని త్యాగం చేస్తారు.

అయితే... విష్ణు, తల్లిదండ్రుల నిజస్వరూపాలు పెళ్ళి దగ్గర పడుతూండనగా బైట పడ్డాయి. వరకట్నం, నగలు, బట్టలు, లాంఛనాలు అంటూ టాపెక్కి కూర్చున్నారు. అంతే కాదు. పెళ్ళికి వచ్చే వెయ్యిమంది ఆహూతులకే మర్యాద లోపం జరక్కూడదు, రాజ భోజనంతో విందు జరగాలి' అంటూ కండిషన్ పెట్టారు. వెరసి భార్య మెడలో మంగళ సూత్రాలు కూడా మిగిలేలా లేవు.

తీరా... ఇప్పుడు... ఇలా? తామిప్పుడు కాదని వెనక్కు తగ్గితే రేపటి పరిస్థితి?... గోకుల భవితవ్యం దృష్టిలో పెట్టుకుని 'సరే' నన్నారు...

గోకుల మెడలో మూడు ముళ్ళు పడి గడపదాటే సరికి దొంగలు దోచిన కొంపలా తాకట్టులో ఉన్న ఇల్లు, నిలువు దోపిడి ఇచ్చినట్లు ఆ దంపతులు మిగిలారు...

పరంధామయ్య గారి దూరపు చుట్టం ఒకాయన వస్తూనే మంచం పట్టె మీద కూర్చుంటూ.

"మా ఇంట్లో దొంగలుపడి దోచుకుపోయార్రా" అన్నాడు దిగులుగా.

"ఏమేం పోయాయేం?" నిర్లిప్తంగా అన్నాడు పరంధామయ్య.

"డబ్బు, నగలు, బట్టలు, సామాను, అన్నీ దోచుకుపోయారు. దొంగలుపడితే అలవికానివి, పనికిరానివి తప్ప ఇంకేం మిగుల్చుతారు?"

"అలవికానిది ఇల్లు, పనికిరానిది మనుషులు. అంతేగా?" విరక్తిగా నవ్వుతూ అన్నాడు పరంధామయ్య.

"బహుశా అంతే! ఔనూ! అమ్మాయికి పెళ్ళి చేశావటగా? మాకు పిలుపు రాలేదేం?"

"ఎక్కువ మందిని పిలిస్తే మర్యాదలు సరిగ్గా జరగవని మానుకున్నాను." అన్నాడే గానీ

"ఉన్నదంతా మగపెళ్ళివారికే చాల్లేదు. ఇంకా నా తరపున పిలవటానికేం మిగిలింది?" అనలేదు.వీళ్ళ సంభాషణ ఇలా సాగుతూండగా....

యమ దర్జాగా, ఠీవిగా గోకుల భర్త, పరంధామయ్య అల్లుడూ అయిన విష్ణు వస్తూండటం చూచి

"ఎవర్రా ఆయన?" అన్నాడా బంధువు.

ఒక్కక్షణం ఆలోచనలో పడిన పరంధామయ్య తేరుకుని

"రాయల్ థీఫ్ .." అన్నాడు.

ఆ బంధువు అర్థం కాక అయోమయంగా చూస్తూంటే...

"నాన్నా! సాంప్రదాయ సిద్ధంగా మీరు ఇవ్వవలసిన 'సారె' తాలూకు డబ్బు లెక్కకట్టి ఇస్తే ఆయన ఇష్టం వచ్చినవి కొనుక్కుంటారట. అందుకోసం మీ అల్లుడు గారు రేపోమాపో బయలుదేరి వస్తున్నారు." అంటూ కూతురిచేత రాయించిన ఉత్తరం కళ్ళముందు కదలాడి పరంధామయ్యని కలవరపెట్టింది.